**SRINIVASA BALABHARATI - 85**
***(Children Series)***

**PARIKSHITTU**

*By*
***Acharya B.R.Sastry***

T.T.D.Religious Publications Series No.: 940
© All Rights Reserved
First Edition : 2015

Copies :

*Published by*

**Dr. D. SAMBASIVA RAO I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. :*
Editor-in-Chief Office, TTD, Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,Tirupati.

**శ్రీనివాస బాలభారతి - 85**

# పరీక్షిత్తు

రచన
**ఆచార్య. బి.ఆర్.శాస్త్రి**

ప్రచురణ
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2015**

## ఆముఖం

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం, వారికథలు చెపుతూ పిల్లలకు తెలియజేయ గలిగితే, వాటి ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే "శ్రీనివాస బాలభారతి" అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలలో ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.



కీ.శే.డా॥ ఎస్.బి.రఘునాథాచార్యగారు రూపొందించిన ఈ ప్రణాళికను కొనసాగిస్తూ అదే శీర్షికన చాలా పుస్తకాలను ప్రచురింపజేయటంతోపాటు వాటిని హిందీ, ఆంగ్లం మున్నగు ఇతర భాషల్లోనికి అనువదింపజేస్తున్న ప్రచురణలవిభాగం ముఖ్యసంపాదకులు అభినందనీయులు. ఈ ప్రణాళికలో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ఒక్కమాట

చిన్నపిల్లల్లో ధార్మిక జ్ఞానాన్ని కల్గించాలని, బాల్యంలో కల్గిన జ్ఞానం జీవితాంతం వారికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ 'శ్రీనివాస బాలభారతి' పథకాన్ని ప్రారంభించింది. దీనికి అప్పట్లో ప్రధాన సంపాదకులుగా ఉండిన ప్రముఖ పండితులు, రచయితలు, మాజీ ఉపకులపతి డా॥యస్.బి.రఘునాథాచార్యులవారు ఈ గ్రంథాలను పరిష్కరించి తీర్చిదిద్దారు. వీరి నేతృత్వంలో కొన్ని వేల ప్రతులను చిన్న పిల్లలకు అందించడం జరిగింది.

మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహా పతివ్రతలు, మహావీరులు భారతీయ సంస్కృతికి చక్కని పునాదులు.వారి జీవిత గాథల్ని సరళ సుందరశైలిలో, అందమైన ముద్రణతో వెలుగులోకి తేవడం జరిగింది. ప్రస్తుతం ఆ పుస్తకాలతో పాటు మరికొన్నింటిని కొత్తగా చేర్చి దేవస్థానం ముద్రించింది. భావి భారత పౌరులైన పిల్లలకు ధార్మిక సాహిత్య పరిచయం కల్గించాలనే సత్సంకల్పంతో తి.తి.దే. వీటిని అందిస్తోంది.

తల్లిదండ్రులే పిల్లలకు ప్రథమ గురువులు. కనుక వారు కూడా ఈ 'శ్రీనివాస బాలభారతి' రచనలను ఆదరించి, పఠించి వాటి ప్రాముఖ్యమును పిల్లలకు తెలియచేసి వారిచేత చదివించాలి. అప్పుడే ఆ బిడ్డలు అందరూ ఆదర్శ వంతులుగా తీర్చిదిద్దబడతారనడంలో సందేహం లేదు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు కనుక ఇప్పటినుండి పిల్లలలో నైతికములైన విలువలను, ఆధ్యాత్మిక చింతనను పెద్దలు అలవాటుచేస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా వెలుగొందుతూ ఆదర్శజీవితం సాగించగలరు. ఆ ఈ సంకల్పానికి ఈ బాలభారతి గ్రంథాలు చేయూతనివ్వగలవని మా విశ్వాసం.

ముఖ్య సంపాదకులు

# పరీక్షిత్తు

మహాభారతయుద్ధంలో శ్రీకృష్ణపరమాత్ముని అనుగ్రహంవల్ల పాండవులు గెలిచారు. కౌరవులు ఘోరంగా ఓడిపోవడం జరిగింది. ఐదుగురు పాండవులలోను మధ్యముడు అర్జునుడు. ఈయన మహాపరాక్రమశాలి. ధనుర్విద్యలో ఇతనితో సమానమైన వీరుడు ఆ కాలంలో లేడు. అర్జునుని భార్య సుభద్ర. ఈమె శ్రీకృష్ణుని చెల్లెలు. సుభద్రకు, అర్జునుడికి పుట్టిన కొడుకు పేరు అభిమన్యుడు. ఈ అభిమన్యుడు ప్రతాపానికి, సాహసానికి పెట్టింది పేరు. విరాటరాజు కూతురు, ఉత్తర కుమారుని చెల్లెలు అయిన ఉత్తరను అభిమన్యుడు పెళ్ళిచేసుకున్నాడు. మహాభారత యుద్ధంలో అభిమన్యుణ్ణి చాలా అన్యాయంగా, అధర్మంగా చంపేశారు కౌరవులు. తన భర్త చనిపోయేటప్పటికి ఉత్తర గర్భవతిగా ఉంది.



పాండవులకు, కౌరవులకు గురువు ద్రోణాచార్యులు. ద్రోణాచార్యుల దగ్గరే అస్త్రాలు, శస్త్రాలు నేర్చుకున్నారు పాండవులు, కౌరవులు. ద్రోణాచార్యుల వారి కొడుకు అశ్వత్థామ. గురువుగారి కొడుకు కదా అని అశ్వత్థామను ద్రోణుని శిష్యులందరు ఆదరాభిమానాలతో చూసేవారు. అశ్వత్థామ మాత్రం పాండవులు అంటే ఇష్టపడేవాడు కాడు. యుద్ధంలో తన తండ్రిని అధర్మంగా చంపారనీ, కౌరవులకు యుద్ధంలో ఎన్నోసార్లు అన్యాయం జరిగిందనీ, పాండవులను ద్వేషిస్తూ ఉండేవాడు అశ్వత్థామ. పాండవులమీద పగతీర్చుకుంటూ నాకు ప్రభువైన దుర్యోధనుని ఋణం తీర్చుకుంటా అని చెబుతూ ఉండేవాడు అశ్వత్థామ.

భీముడు దుర్యోధనుని తొడ విరగకొట్టి అతన్ని చిత్తుగా ఓడించాడు. అశ్వత్థామకు ఇది కూడా ఏమాత్రం నచ్చలేదు.

పాండవులకు ఐదుగురు కొడుకులున్నారు. వీరిని ఉపపాండవులు అంటారు. ఒకరాత్రి ఉపపాండవులు



నిద్రిస్తుండగా అశ్వత్థామ వెళ్ళి వారి తలలు కోసి చంపేశాడు. ఇలాంటి నీచాతి నీచమూ ఘోరమూ అయిన పనికి ఒడిగట్టిన అశ్వత్థామను శిక్షించడానికి కృష్ణార్జునులు అతణ్ణి వెంబడించారు. భయపడిపోయి అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. అర్జునుడు కూడా మరొక బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించి అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించాడు. కృష్ణార్జునులు అశ్వత్థామను బంధించి ద్రౌపది దగ్గరకు తీసుకువెళ్ళారు. కరుణామయురాలైన ద్రౌపది అశ్వత్థామను వదలివేయమని చెప్పింది. అర్జునుడు అశ్వత్థామ శిరోముండనం చేసి శిరస్సులో ఉన్న మణిని తీసుకుని వెళ్ళగొట్టాడు. ఒకటి తరువాత ఒకటిగా అవమానాలే భరించవలసి వస్తోందని అశ్వత్థామ కుమిలిపోతున్నాడు.

**ఉత్తరపై బ్రహ్మాస్త్రప్రయోగం:**

శ్రీకృష్ణపరమాత్మ యుద్ధంలో పాండవులకు జయాన్ని చేకూర్చాడు. తరువాత వారిని సామ్రాజ్యంలో చక్కగా

స్థిరపరచాడు. ఇప్పుడు ఆయన తన రాజధాని అయిన ద్వారకకు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. రథంలో కూర్చున్నాడు. పాండవులు ఆయనకు వీడ్కోలు చెబుతున్నారు. అలాంటి తరుణంలో కృతఘ్నుడైన అశ్వత్థామ అభిమన్యుని భార్య అయిన ఉత్తరపై బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగిస్తూ ఇలా గర్జించాడు. ఈ దెబ్బతో పాండవ వంశం నిర్మూలమవుతుంది. పాండవుల పేరు కూడా తుడిచిపెట్టుకుపోతుంది. లోకం అపాండవం అవ్వాలి.

ఆ బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భంలోకి చొచ్చుకుపోయింది. ఒక్కమాటుగా ఉత్తర కంపించిపోయింది. బ్రహ్మాస్త్రానికి తట్టుకోలేక తల్లడిల్లిపోయింది. ఏమి చేయడానికి ఆమెకు తోచలేదు. అటువంటి సమయంలో ఎవరు ఎవరిని ఆదుకోగలరు? ఒక్క పరమేశ్వరుడు తప్ప. దిక్కులేనివారికి దేవుడే కదా దిక్కు. ఆమె కళ్ళనుంచి కన్నీరు కాలువలై



ప్రవహించింది. బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది. తదేక ధ్యానంతో ఉత్తర శ్రీకృష్ణపరమాత్మను ప్రార్థించింది.

## నువ్వు తప్ప నాకు దిక్కెవరు?

దేవదేవా! ఆపదలో చిక్కుకున్నాను స్వామీ! సర్వేశ్వరా! రక్షించు. రక్షించు! నువ్వు తప్ప నాకు దిక్కెవరు? మంటలు కక్కుతూ ఈ అస్త్రం నన్ను దహించివేస్తోంది. ఇక నేను బతకను. నేను పోతానన్న చింత నాకు లేనేలేదు. కాని నా కడుపులో ఉన్న బిడ్డను కాపాడు. ఈ శిశువు పాండవవంశానికి అంకురం.

అదేసమయంలో పాండవులు ఐదుగురు తమ మీదకు వేర్వేరుగా మహావేగంతో వస్తున్న ఐదు బాణాల్ని చూశారు. ఆ బాణాల్ని ఎదుర్కోవడానికి వారు తమ తమ అస్త్రాన్ని సంధించారు.

పరమాత్ముడు అంతటా ఉన్నాడు. అందరి హృదయాల్లోను ఉన్నాడు. ఆయన తన భక్తులు కష్టాలలో ఉండడం ఏ మాత్రం సహించలేడు. సంపూర్ణమైన నిశ్చలమైన మనస్సుతో 'రక్షించు'



అని భక్తుడు అడిగితే చాలు భగవంతుడు భక్తునికి అండగా నిలువకుండా ఉండలేడు. అనాథరక్షకుడైన ఆ జగన్నాథుడు పాండవులకు ఆసరాగా నిలబడ్డాడు. తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించి అతడు వారి ఆపదను పారద్రోలాడు. ఆ యోగీశ్వరుడు తన మాయతో ఉత్తరగర్భాన్ని కప్పేశాడు. సమస్తలోకాన్ని సృష్టించి పాలించే పరమాత్మకు ఇటువంటి మహాద్భుతమైన పని ఒకలెక్కా! తల్లికడుపులో ఉడికిపోతున్న శిశువుకు ఒక విచిత్రమైన వ్యక్తి కన్పించాడు. అప్పుడు అతడు బొటనవేలంత ఉన్నాడు. నల్లనివాడు నాలుగు చేతులున్నవాడు ఆ చిన్నమనిషి తన గదను గిరగిర తిప్పుతూ శిశువు చుట్టూ తిరుగుతున్నాడు. సూర్యుని వేడికిరణాలు తగలగానే కరిగిపోయే మంచులా ఆ బ్రహ్మాస్త్రం ఒక్కమాటుగా మాయమైపోయింది. ఎవరు ఈ మహాత్ముడు? ఆ శిశువు ఆలోచించడం మొదలు పెట్టాడు. కాని అది ఎవరో అతనికి అంతుపట్టలేదు. ఆ గర్భంలో ఉన్న శిశువు చూస్తు ఉండగానే ఆ వ్యక్తి మాయ మయ్యాడు.



జాతకరీత్యా చాలా శుభంగా ఉన్న సమయంలో ఉత్తరకు ఒక కొడుకు పుట్టాడు. అప్పుడు గ్రహాలన్నీ మంచిస్థితిలో ఉన్నాయి. ఈ పిల్లవాడే కదా పాండవ వంశాన్ని ఉద్ధరించేవాడు? పాండవుల కులాన్ని అంతరించిపోకుండా చేసేవాడు! ఈ చిన్నవాడు ముమ్మూర్తులా తన ముత్తాత అంటే తన తాతగారైన అర్జునుడి నాన్నగారి నోట్లోంచి ఊడిపడినట్లున్నాడు. పాండురాజుకు ఈ పిల్లవాడికీ ఎంత పోలిక! ధర్మరాజు మనుమణ్ణి చూసి పొంగిపోయాడు. వంశోద్ధారకుడి జాతకర్మ మొదలైన సంస్కారాల్ని ఘనంగా చేయించారు పాండవులు. ధర్మరాజు ప్రజలకిచ్చిన దానధర్మాలకు, బహుమతులకు అంతే లేదు.

జ్యోతిష్కులు ముద్దులు మూటగట్టే ఆ పిల్లవాణ్ణి చూసి ఆనందాన్ని ఆపుకోలేకపోయారు. పిల్లవాడి జాతకాన్ని బాగా పరిశీలించి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "మహారాజా! ఈ శిశువును తల్లికడుపులో చనిపోకుండా రక్షించినవాడు ఆ

మహావిష్ణువే. విష్ణువుచేత ఇవ్వబడ్డాడు కనుక ఈ పిల్లవాడి పేరు 'విష్ణురాతుడు' అని ఉండాలి. ఇతడు సామాన్యుడు కాడు. ఒక మహాపురుషుడౌతాడు. రాముడు, శిబి, భరతుడు, కార్తవీర్యార్జునుడు, రంతిదేవుడు, యయాతి, ప్రహ్లాదుడు - ఇలాంటి మహానుభావులతో సమానమైన కీర్తిని గడిస్తాడీ విష్ణురాతుడు. ఇంతకూ ఒక్క విషయం. చివరకు ఇతణ్ణి ఒక బ్రాహ్మణకుమారుడు శపిస్తాడు. దాంతో ఇతడు పరమ విరక్తుడౌతాడు. వ్యాసుని కొడుకు శుకుడు అప్పుడు ఇతనికి ఆత్మతత్త్వాన్ని ఉపదేశిస్తాడు. దాంతో ఇతడు గంగానదిలో పరమపదిస్తాడు. ఇవి శిలాక్షరాలు. ఇలా తు.చ.తప్పకుండా జరిగితీరుతుంది. ఈ మాటలు అక్కడ అందరికీ సంతోషాన్ని, బాధను కూడ కలిగించాయి.

నేను మా అమ్మ కడుపులో ఉండగా నాకు కన్పించిన ఆ మనిషి ఎవరు? అని విష్ణురాతుడు ఎప్పుడూ ఆలోచిస్తూనే



ఉండేవాడు. తనకు కన్పించిన మనుషులందరిలోనూ అలాంటి వ్యక్తి ఎవరైనా ఉన్నాడా అని పరీక్షిస్తూ ఉండేవాడు. అందుచేతనే విష్ణురాతుడికి 'పరీక్షిత్' అన్న పేరు కూడా వచ్చింది. పరీక్షించేవాడు కనుక పరీక్షిత్తు.

పరీక్షిత్తు శుక్లపక్షంలో చంద్రుడులా పెరిగి పెద్దవాడయ్యాడు. మంచి గుణాలకు అతడు నిధి. అతని శరీరసౌష్టవం, అందం, వినయం, నడవడిక అందరినీ ఆకట్టుకొన్నాయి. తన్ను మరణంనుంచి కాపాడిన ఆ కృష్ణపరమాత్మను ప్రతిక్షణం తన హృదయంలో భక్తితో తలచుకుంటూ ఉండేవాడు.

శ్రీకృష్ణుడు తన లీలలతో లోకాన్ని అనుగ్రహించి తన అవతారాన్ని చాలించాడు. నటుడు అనేక వేషాలు వేసి వివిధమైన పాత్రల రూపాల్లో లోకానికి కన్పిస్తాడు. కాని నటుడు వేరు, పాత్ర వేరు. అలాగే నిర్గుణమూ, నిరాకారమూ అయిన పరబ్రహ్మ శ్రీకృష్ణరూపంలో అవతరించినట్లుగా లోకులకు



కన్పించి మాయమయ్యాడు. నిజం చెప్పాలంటే ఆ భగవంతుడికి పుట్టుక, చావు అన్నది లేనేలేవు. శ్రీ కృష్ణుడు తన అవతారాన్ని ముగించిన క్షణంలోనే లోకంలో కలియుగం మొదలైంది.

కృష్ణుడు ఈ లోకాన్ని వదలివెళ్ళాడన్న వార్త పాండవుల్ని దుఃఖంలో ముంచివేసింది. వారికి ఈ లోకం అంటేనే విరక్తి కలిగింది. సర్వవిధాలా సమర్థుడైన పరీక్షిత్తుకు రాజ్యాభిషేకం చేసి పాండవులందరు శ్రీకృష్ణుని ధ్యానిస్తూ ఉత్తరదిక్కుగా ప్రయాణం సాగించారు. చివరకు వారు పరలోకం చేరుకున్నారు.

జ్యోతిష్యం ఎప్పుడూ అబద్ధం కాదు. జ్యోతిష్కులు చెప్పినట్లుగానే పరీక్షిత్తు ఒక ఆదర్శమైన పద్ధతిలో రాజ్యపాలన చేశాడు. మహాత్ముడు అన్న పేరు తెచ్చుకున్నాడు. ఆయన తన మేనమామ ఉత్తరుడి కూతురైన ఇరావతిని పెళ్ళాడాడు. ఇరావతీ పరీక్షిత్తులకు నలుగురు కొడుకులు కలిగారు. జనమేజయుడు వారందరిలో పెద్దవాడు. పరీక్షిత్తు రాజధాని



హస్తినాపురం ఎంతో అందమైన పట్టణం. పరీక్షిత్తు కృపాచార్యుణ్ణి గురువుగా చేసుకున్నాడు. గంగానది ఒడ్డున బ్రహ్మాండమైన యజ్ఞశాలలు నిర్మించి మూడు అశ్వమేధ యజ్ఞాలు చేశాడు. ఈ అశ్వమేధయాగాల విశేషం ఒకటి ఉంది. దేవతలు ప్రత్యక్షంగా కనబడి యజ్ఞభాగాలు పుచ్చుకున్నారు. ఇంత గొప్పగా యజ్ఞం చేసిన కీర్తి పరీక్షిత్తుకే దక్కింది.

తన రాజ్యమైన కురుజాంగలంలో కలి ప్రవేశించాడని విన్నాడు పరీక్షిత్తు. అతనికి చాలా విచారం కలిగింది. కలిని జయించి తన రాజ్యంనుంచి వెళ్ళగొట్టాలనుకున్నాడు. సేవకులు బాగా అలంకరించిన రథాన్ని సిద్ధం చేశారు. జెండా మీద సింహంగుర్తు భయంకరంగా కన్పిస్తోంది. పరీక్షిత్తు హస్తినాపురం నుంచి రథమెక్కి దిగ్విజయానికి బయలుదేరాడు. పరీక్షిత్తును అతని సేనలు అనుసరించాయి. శత్రువులు పరీక్షిత్తు పరాక్రమం ముందు ఆగలేకపోయారు. విరోధులు

అతనిని 'దాసోఽహమ్' అన్నారు. భద్రాశ్వము, కేతుమాలము, ఉత్తర కురువులు, కింపురుషదేశము మొదలైన దేశాలవారు పరీక్షిత్తుకు లొంగిపోయారు. అతనికి కప్పం కట్టడానికి ఒప్పుకున్నారు.

విజయయాత్ర ఇలా జరుగుతుండగా పరీక్షిత్తుకు ఒక విశేషం గోచరించింది. అది ఏమిటంటే ఎక్కడకు వెళ్ళినా అతని చెవులకు వినిపించేది ఒకటే. అది అతని పూర్వీకుల ఘనమైన కీర్తి. ప్రజలు గుమికూడి పాండవుల గొప్పతనాన్ని శ్రీకృష్ణుని మహాత్మ్యాన్ని, భారతయుద్ధాన్ని శ్రీకృష్ణుడు ఉత్తర గర్భాన్ని రక్షించిన ఘట్టాన్ని పాటల్లో, పద్యాల్లో వర్ణిస్తూ పాడుకునేవారు. యాదవులు, పాండవులు, శ్రీకృష్ణుని భక్తితో ఎలా గౌరవించేవారో జనం బారులు తీరి శ్రద్ధగా ముచ్చటించుకునేవారు. ఆ గానానికి పరవశుడై ఒళ్ళుమరచిపోయి వినేవాడు పరీక్షిత్తు. అప్రయత్నంగా అతనిచేతులు శ్రీకృష్ణుని పాదాలకు నమస్కరించేవి.



ప్రజల్ని పరీక్షిత్తు తన స్వంత బిడ్డలకన్నా ఎక్కువ ప్రేమతో చూసుకునే వాడు. ప్రజలకు కూడ అతనంటే చెప్పలేనంత ఆదరం, గౌరవం.

ఇలా అతడు దిగ్విజయంతో దేశాలన్నీ పర్యటిస్తూ ఉండగా ఒక విచిత్రమైన సంఘటన జరిగింది.

## ఎందుకు దుఃఖిస్తున్నావు?

పరీక్షిత్తు సరస్వతీ నదీతీరాన్ని చేరుకున్నాడు. అక్కడ అతనికి ఒక ఎద్దు, ఒక ఆవు కన్పించాయి. ఆ వృషభానికి ఒకే కాలు ఉంది. మిగిలిన మూడు కాళ్ళు విరిగిపోయాయి. ఆ ఉన్న ఒంటికాలుతోనే ఆ ఎద్దు ఎలాగో తిరుగుతోంది. ఆ బక్కచిక్కిన ఆవుకళ్ళనుంచి కన్నీరు వరదలై పారుతోంది. దూడ చచ్చిపోయిన ఆవు ఎలా దీనంగా ఉంటుందో అంతకన్నా ఎక్కువగా దుఃఖమయంగా ఉంది ఆ గోవు.



ఆ ఆవు, ఆ ఎద్దు, ఎవరో కాదు ధర్మదేవత, భూదేవి ఆ రూపంలో ఉన్నారు. ఆ వృషభం గోవుతో ఇలా అంటోంది. "ఓ కల్యాణమయీ! గోదేవీ! అంతా క్షేమమా! ఎందుకలా వాడిపోయావు? ఎందుకలా కుంగిపోతున్నావు? వెలవెల పోతున్నావు? ఎందుకోసం ఆ విచారం? ఏమిటి? స్త్రీలకు, పిల్లలకు, ఏమైనా కష్టం ముంచుకొచ్చిందా? నా మూడు కాళ్ళూ విరిగిపోయాయని, ఒంటికాలితో ఎలా బ్రతుకుతున్నానని నీకు విచారమా? రాజులు ప్రజల్ని సరిగ్గా పరిపాలించటం లేదని నీకు దుఃఖమా? విద్యావిధానం పాడవుతోందని చింతా? కలియుగంలో ప్రజలు కేవలం తమ తమ స్వార్థంకోసం తమ ఇష్టం వచ్చినట్లు నడచుకుంటారని నీకు భయమా? నిన్న మొన్నటిదాకా పరమాత్ముడైన శ్రీకృష్ణుడు నీమీద నడచి తన పాదాలతో నిన్ను పవిత్రం చేసేవాడు. పాదస్పర్శకు నీవు పరవశించిపోయేదానివి కదూ! ఇప్పుడు ఆ స్వామి లేడని కన్నీరు కారుస్తున్నావా? ఆయన వియోగం నిన్ను బాధిస్తోందా?



ధర్మమా! వృషభరాజా! నీకు తెలియనిదేముంది? అంది ఆవు. అయినా అడిగావు. కనుక చెప్తాను విను. సత్యం, శౌచం, దయ, క్షమ, త్యాగం, సంతోషం, అమాయకత, శమం, దయ, తపస్సు, సమత్వం, తితిక్ష, ఉపరతి, విద్య, జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం, శౌర్యం, తేజస్సు, బలం, స్మృతి, స్వతంత్రత, కుశలత, కాంతి, ధైర్యం, మృదుత్వం, నిర్భయత, వినయం, శీలం, సాహసం, ఉత్సాహం, పట్టుదల, సౌభాగ్యం, గంభీరత, స్థిరత, ఆస్తికత, కీర్తి, అభిమానం, నిరహంకారం- ఈ ముప్పైతొమ్మిది మహాగుణాలకు శ్రీ కృష్ణుడు అలవాలం. ఈ ఉన్నత గుణాలకు, ఇంకా ఎన్నో సద్గుణాలకు ఆయన ఆశ్రయం. ఈ గుణాలు అతన్ని ఎప్పుడూ వదలి ఉండవు. అలాంటి మహాపురుషుని వియోగం క్షణమైనా భరించగలనా? బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మొదలైనవారికి కూడా శరణాలు అతని చరణాలే. ఆ పాదాలు వజ్రం, అంకుశం, కమలం మొదలైన శుభమైన గుర్తులతో అంకితమై ఉంటాయి. ఆ

పాదాల అందం ఇలా ఉంటుంది అని చెప్పడం నాకే కాదు ఎవరికైనా అలవికాని విషయమే. శ్రీ కృష్ణపరమాత్మ నన్ను తన పాదాలతో స్పృశిస్తూ నామీద నడుస్తూ ఉంటే నేను మైమరచి పోయేదాన్ని. ఏమిటీ నా అదృష్టం? ఏమిటి నాపై భగవంతుడి ఈ కృప? అని మురిసిపోతూ ఉండేదాన్ని. నా హృదయంలో ఆనందం కట్టలు తెంచుకొని ప్రవహించేది. నా సౌభాగ్యానికి గర్వంతో నిండిపోయేదాన్ని. ఇప్పుడు నా దురదృష్టం ఏమని చెప్పను? నిజం చెప్పాలంటే నాకు ఆ కలిదృష్టే తగిలిందేమో! నా గర్వానికి తగిన శాస్తి అయింది. ఆ పరమాత్మ వియోగం భరించలేను ఇక! ఆ వృషభం, గోవు ఇలా మాట్లాడుకుంటూ ఉంటే పరీక్షిత్తు వింటున్నాడు.

ఆ ఎద్దు ఆవుల దగ్గరికి అమాంతంగా ఒక పురుషుడు వచ్చాడు. అతడు వృషలుడు. అతన్ని చూసి ఆ తెల్లఎద్దు గజగజ వణికిపోయింది. భయంతో అది మూత్రం చేయడం



మొదలుపెట్టింది. ఆ దుండగీడు ఎద్దును కొట్టాడు. తన్నాడు. బాదాడు. ఎద్దుకు ఒక కాలు మీద నిలబడడమే కష్టం. అది నేలమీద పడబోయింది. కాని ఎలాగో తమాయించుకొని నిలబడింది. యజ్ఞయాగాలకు శరీరం పుష్టికి, ధర్మానికి ఉపయోగపడే ఆవు ఎంతో పూజ్యమైంది. అలాంటి పవిత్రమైన గోవును, అందులో అసహాయస్థితిలో ఉన్న దానిని, దీనురాలైన దానిని ఆ క్రూరుడు కాలుతో గట్టిగా తన్నాడు. ఎంత హీనమైన పని! ఆ ఆవు అప్పుడు ఆకలితో బాధపడుతోంది కూడా.

ఆ సన్నివేశాన్ని చూసిన పరీక్షిత్తు గుండె కరిగిపోయింది. అతని కోపం కూడా మిన్నుముట్టింది. వెంటనే ధనుస్సు ఎక్కుపెట్టి మేఘంలా గర్జిస్తూ అన్నాడు. ఎవడవురా నువ్వు? నా రాజ్యంలో బలహీనుల్ని ఇలా హింసిస్తున్న దుష్టుడా నువ్వు ఎవరు? ఆగు. ఆగు. నీకు ఆయువు మూడింది.”

ఆ ఎద్దును చూసి పరీక్షిత్తు ఇలా అన్నాడు. “ఎంత తెల్లగా, స్వచ్ఛంగా ఉన్నావు. ఒకే కాలుతో దీనంగా నడుస్తున్నావు.



నిన్ను చూస్తే నా గుండె తరుక్కు పోతుంది. ఏమిటిది? ఎద్దురూపంలో సంచరించే దేవతవు కాదు కదా!”

“గోమాతా! విచారించకు. ఏడవకు. ఏ రాజ్యంలో ఇలా నీలాగా దీనులు పీడింపబడతారో ఆ రాజ్యం సర్వనాశనం అయితీరుతుంది. ఆ రాజు జాగ్రత్తగా నడచుకోవలసిన రోజులు వచ్చాయన్నమాట అన్నాడు పరీక్షిత్తు.”

విల్లుతాడు మోగిస్తూ పరీక్షిత్తు ఇలా గర్జించాడు. ఈ దుర్మార్గుణ్ణి ఈ వృషలుణ్ణి ఇప్పుడే కడతేరుస్తా. నీ కాళ్ళు విరగగొట్టింది ఎవరు? వాణ్ణి ఇప్పుడే శిక్షిస్తా. పరమ పవిత్రమైన ఈ గోమాతను హింసించిన ఈ ముష్కరుణ్ణి చూడండి ఏం చేస్తానో. దుష్టులను దండించడం, సజ్జనులను రక్షించడం పాండవ వంశీయుల కులాచారం, ధర్మం.

ఆ మాటలు విని వృషభం ఇలా అంది. “రాజా! నీవు నీ వంశానికి అనుగుణంగానే మాట్లాడావు. మీ పాండవ వంశం



మహాత్ములకు జన్మ ఇచ్చింది. ఒక్క ప్రశ్న. లోకం దుఃఖమయం కదా! ఈ దుఃఖానికి కారణం ఏమిటి? ఈ దుఃఖానికి అనేకులు కారణాలు చెప్తారు. కొందరు మనిషి తన దుఃఖానికి తానే కారణం అవుతాడు అంటారు. అదృష్టం, స్వభావం, ప్రారబ్ధం, ఈశ్వరుడు - ఇంకా ఇలా ఎన్నో కారణాలున్నాయి. దుఃఖానికంటారు మరికొందరు. ఏమిటి నీ అభిప్రాయం?

పరీక్షిత్తుకు ఆ ప్రశ్నించేది ఎవరో అర్థమైంది. ‘మహాత్మా! నువ్వు ధర్మదేవతవు. వృషభరూపంలో నాకు కన్పిస్తున్నావు. నన్ను నువ్వు అడిగిన ప్రశ్న చాలా జటిలమైంది. అయినా సమాధానం చెప్తాను. నిజం చెప్పాలంటే మనిషి తన మనస్సులో దేవుడి మాయను తెలుసుకోలేడు. అన్ని వస్తువులకు కారణం ఈ మాయను ఆశ్రయించి ఈ మాయకు అతీతంగాను ఉంటుంది. మాయనే తెలుసుకోవడం కష్టం. ఇక పరతత్త్వం సంగతి వేరే చెప్పాలా. ఈ పరమాత్మ శక్తి

తర్కానికి అందదు. కనుక దుఃఖానికి అసలైన మూలకారణం సామాన్యంగా తెలియదనే చెప్పాలి.

కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని యుగాలు నాలుగు. కృతయుగంలో నీకు తపస్సు, పవిత్రత, దయ, సత్యము - అనే నాలుగు పాదాలుండేవి. అప్పుడు సమాజంలో ధర్మం నాలుగు పాదాలా నడిచేది. గర్వం, సంగం, మదం ఇవి పెరిగిపోవడంవల్ల నీ మూడు పాదాలు నష్టమై పోయాయి. ఇప్పుడు నీకు సత్యం అనే ఒక పాదమే మిగిలింది. ఇప్పుడు నానాటికీ విజృంభిస్తున్న అసత్యాన్ని ఆసరాగా చేసుకున్నాడు కలి. నీ ఈ మిగిలిన నాలుగో పాదాన్ని కూడా హరిద్దామని చూస్తున్నాడు ఆ కలే. ఇది సంక్షేపంగా ఈ సంగతి.

ఇక నీ గోవు సంగతి విను. భూమాతే నాకు గోరూపంలో ప్రత్యక్షమైంది. శ్రీకృష్ణపరమాత్మ అవతారం



ముగిశాక భూదేవికి పెద్ద ఆపద కలిగింది. సంస్కృతిలేని వాళ్ళు, స్వార్థపరులు, భోగపరాయణులు, వృషలులు రాజచిహ్నాలు ధరించి రాజ్యం చేస్తారు.

'ఇదే కదా నీ భయం, చింత, నేనున్నా కదా! ధర్మాన్ని నాప్రాణంకంటే పదిలంగా కాపాడుతా' అంటూ పరీక్షిత్తు అధర్మానికి కారణమైన కలిని సంహరించడానికి ఖడ్గం దూశాడు.

"రక్షించు రక్షించు శరణు శరణు" అంటూ కలి తనకున్న రాజచిహ్నాల్ని తీసివేసి పరీక్షిత్తు పాదాల మీద పడ్డాడు. పరీక్షిత్తుకు కలిమీద జాలి కలిగింది. మహాత్ముల హృదయాలు పువ్వులాగా మెత్తగా ఉంటాయి. అవి ఎలాంటి వారి కష్టాన్నైనా చూసి సహించలేవు". నవ్వుతూ అన్నాడు పరీక్షిత్తు - నేను అర్జునుని వంశంలో పుట్టినవాణ్ణి. శరణు అన్నవాణ్ణి ప్రాణాలైనా ధారపోసి కాపాడడం నాధర్మంగా భావిస్తాను, నేను. కాని చూస్తే అధర్మానికి మారు పేరు నీవు. నీలాంటివాణ్ణి రక్షించడం అన్నది



పాముకు పాలు పోసి పెంచడం లాంటిదే. అంతేకాదు నీవంటి దుష్టుడికి నా రాజ్యంలో నిలువనీడ కూడా ఉండకూడదు. ఈ బ్రహ్మావర్తంలో సజ్జనులే ఉంటారు. ఏం చేస్తే - బాగుంటుంది.

వెంటనే కలి అందుకున్నాడు. 'సార్వభౌమా! తమ ఆజ్ఞను శిరసా వహిస్తాను. ఇదిగో మీ రాజ్యంనుంచి వెళ్ళిపోతాను. నాకు స్థానం చూపెట్టండి. తమరు ఎక్కడ ఉండమంటే అక్కడే ఉంటాను.

అప్పుడు పరీక్షిత్తు ఇలా ఆదేశించాడు. "కలీ! అయితే విను. నువ్వు నివసించే స్థానాలు చెపుతాను. జూదము, స్త్రీసక్తత, తాగుడు, హింస - వీటిల్లో నువ్వు నివాసం ఏర్పరుచుకో. ఇవేకాక ఇంకా వేరుగా ఏవైనా స్థానాలున్నాయా అని అడుగుతావా? ఉంది విను. ఆ స్థానం పేరు సువర్ణం. ఈ సువర్ణం సమస్త దోషాలకూ, పాపాలకు పుట్టినిల్లు. ఇందులో అసత్యం, మదం, కామం, వైరం, రజోగుణం గూడుకట్టుకొని



ఉంటాయి. దీన్ని వశం చేసుకోవడానికి అన్ని పాట్లు పడతాడు మనిషి."

పరీక్షిత్తు శాసనం ప్రకారం అసత్యం మొదలైన వాటికి నిలయమైన సువర్ణంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు కలిపురుషుడు.

కనుక తన మంచిని, సమాజం మంచిని, దేశం మంచినీ కోరే ఏ వ్యక్తి కూడా ఈ సువర్ణానికి, దాన్ని ఆశ్రయించి ఉండే అసత్యం మొదలైన వాటికి వశుడుగా ఉండకూడదు. రాజులు, నాయకులు, గురువులు - వీరందరు వీటికి స్వయంగా దాసులు కాకుండా ఉండాలి. అంతేకాదు ప్రజలకు ఈ విషయంలో వారు మార్గదర్శకులుగా ఉండాలి.

తరువాత పరీక్షిత్తు తపస్సు, పవిత్రత, దయ అనే మిగిలిన మూడు పాదాలు ధర్మానికి సమకూర్చి, భూదేవిని

ఊరడించాడు. ఆయన రాజ్యంలో ప్రజలందరు ధర్మాన్ని పూర్తిగా పాటించేవారు. ఆయన రాజ్యంలో అధార్మికుడన్న వాడు అసలు ఉండేవాడు కాడు.

పరీక్షిత్తు ఒకనాడు వేటకు వెళ్ళాడు. చేతిలో ధనస్సుతో అతడు అడవిలో తిరుగుతూ ఉంటే జంతువులు భయ భ్రాంతులయిపోయాయి. దుష్టమృగాల్ని సంహరిస్తూ ఆయన తన ధనుర్విద్యలో ఉన్న నేర్పును చూపెట్టాడు. అలా తిరుగుతూ తిరుగుతూ అలసిపోయాడతడు. అమాంతంగా అతనికి చాలా దాహంవేసింది. ఆకలి కూడా అతన్ని దహించడం మొదలు పెట్టింది. ఎక్కడ వెదికినా నీటిచుక్కైనా కన్పించలేదు అతనికి. నిప్పుకు గాలి సహాయపడినట్లు ఆ దాహానికి ఆకలి కూడా తోడై పరీక్షిత్తును కల్లోలపరచింది. అతనికి మూర్ఛవచ్చే పరిస్థితి వచ్చింది. ప్రాణాల్ని రక్షించుకోవడంకోసం అతడు అటూ ఇటూ పరుగెత్తడానికి ప్రయత్నించాడు. కాని కాళ్ళు ముందుకు



పడటం లేదు. నాలుగువైపులా చూశాడు. కొద్దిదూరంలో అతనికి ఒక ఆశ్రమం కనిపించింది. ఎలాగో శరీరాన్ని అక్కడకు చేరవేశాడు.

అక్కడ అతనికి ఒక ముని కనిపించాడు. ఆ ముని ముక్కు మూసుకొని ధ్యానం చేసుకుంటున్నాడు. అతడు లేడిచర్మాన్ని ధరించాడు. జడలు ఒంటినంతటిని కప్పివేశాయి. ఈ లోకంతో అతనికి ఏమీ సంబంధం ఉన్నట్లు లేదు. ఇంద్రియాలను మనస్సును, బుద్ధిని, ప్రాణాలను అహంకారాన్ని నిగ్రహించి ఆ మహర్షి పరమాత్మలో కలసిపోయాడా అన్నట్లుంది. బ్రహ్మమంటే జాగ్రత్తు, స్వప్నము, సుషుప్తి అనే మూడు అవస్థలను మీరి ప్రకాశించే వెలుగు. ఆ వెలుగుకు గుణాలు కాని, ఆకారం కాని ఉండవు. ఆ వెలుగుతో ఐక్యాన్ని పొందాడు మహర్షి. అతడు నాలుగవ అవస్థలో ఉన్నాడన్నమాట. ఇటువంటి అతీతమైన దశలో ఉన్న ఆ మహర్షికి పరీక్షిత్తుతో కాని, అతని ఆకలి దాహాలతో కాని ఏమి పని?



## సమాధిలో శమీకుడు :

ఎంతైనా పరీక్షిత్తు ఒక మహారాజు, సార్వభౌముడు. మహర్షి తన్ను ఆహ్వానించి, కుశలప్రశ్నలు అడిగి, తనకు తాగడానికి మంచినీళ్ళిస్తాడు అనుకున్నాడు పరీక్షిత్తు. అతడు అటువంటి సత్కారాలకు అలవాటు పడినవాడు కదా! అలా ఆశించడం కూడా అతని తప్పు కాదు. కాని అక్కడ అప్పుడు ఉన్న పరిస్థితులు వేరు. మహర్షి ఈ లోకం సంగతే పట్టించు కోవడం లేదు. అతడు సమాధిలో ఉన్నాడు.

"నా నోరెండిపోతోంది. కళ్ళు తిరిగిపోతున్నాయి. దాహం అయ్యో! దాహం! ఏం చెయ్యను? ప్రాణాలు కూడా పోతున్నాయి" అనుకున్నాడు పరీక్షిత్తు. అయినా ఒక పని చేస్తాను అనుకున్నాడతడు. నాకు దాహం వేస్తోంది. తాగడానికి నీళ్ళున్నాయా? అని ఆ మహర్షికి వినపడేలా గట్టిగా అరిచాడు ఆ సార్వభౌముడు. సాధారణంగా పరీక్షిత్తుయొక్క మెప్పు పొందడానికి ప్రయత్నిస్తారు ప్రజలు. అతనికి కావలసింది



అతను అడగకుండానే అతనికి ఇస్తారు అందరూ. కాని ఇక్కడ శమీకుడు పరీక్షిత్తుకు జవాబు కూడా ఇవ్వలేదు. అతడు అసలు ఈ లోకంలో ఉంటేగా మాట్లాడడానికైనా.

## దొంగవలె నటిస్తున్నావా?

పరీత్తుకు శమీకుని ప్రవర్తన చాల ఆశ్చర్యం కలిగించింది. అతనికి ఎంతో నిరాశ కలిగింది. ఆ నిరాశ క్రోధంగా మారింది. అతడు భగ్గున మండిపడ్డాడు. దాహమనే అగ్ని, క్రోధమనే అగ్ని అతనిలో ప్రళయాన్ని సృష్టించాయి. అతన్ని ఇలా అశాంతి అలముకోవడం అతని జీవితంలో ఇదే మొదటిసారి. మహర్షి అంటే అతనికి అసహ్యం వేసింది. "ఇదా నీ సంగతి నీ పని పడతా చూడు మునీ" అన్నాడు పరీక్షిత్తు. అతని దగ్గరే ఒక పాము చచ్చిపడి ఉంది. పరీక్షిత్తు దాన్ని చూశాడు. "నువ్వు సరిగా సమయానికి కనిపించావు' అన్నాడు. దాన్ని తన ధనుస్సు కొనతో పైకి ఎత్తి మహర్షి మెడమీద వేశాడు.





ఓ మునీ! ఏమిటి ఈ పరీక్షిత్తు అంటే. వీడి లెక్క నాకేమిటి? అని నన్ను కించపరచడానికి దొంగసమాధి నటిస్తున్నావా? లేక నిజమైన సమాధిలోనే ఉన్నావా? అసలు సంగతి ఇక తేలుతుందిలే అని అంటూ పరీక్షిత్తు ఆ ఆశ్రమంనుంచి వెళ్ళిపోయాడు.

శమీక మహర్షికి శృంగి అనే కొడుకు ఉన్నాడు. అతడు ఆ సమయంలో స్నేహితులతో కౌశికీనది ఒడ్డున ఆడు కుంటున్నాడు. కొందరు ఋషికుమారులకు పరీక్షిత్తు చేసిన ఘోరం తెలిసింది. వారందరూ శృంగి దగ్గరకు ఆఘమేఘాల మీద వెళ్ళారు. అతనితో పరీక్షిత్తు శమీక మహర్షికి చేసిన ఘోరమైన అన్యాయం గురించి చెప్పారు. శృంగి హృదయంలో పెనుతుఫాను వీచినట్లయింది. అతని క్రోధావేశం మిన్ను ముట్టింది. అతని ముఖం జేవురించింది. కళ్ళల్లోంచి నిప్పులు కురిశాయి. బిగ్గరగా అరచాడు శృంగి-ఏమిటి! రాజు మా



నాన్నగార్ని అవమానిస్తాడా! ఏమిటి ఈ రాజుల పొగరు. ప్రజలు పన్నులు ఇస్తే వాటితో బతికే ఈ రాజులు ప్రజలకు దాసులైన రాజులు, ప్రజలమీదే అత్యాచారం చేస్తారా? ఏమిటి ఈ కండకావరం? తనకు ఏమీ అపకారం చేయక అడవిలో ముక్కుమూసుకొని తపస్సు చేసుకునే మహర్షిమీదా ఈ పాపాత్ముడి దుశ్చేష్టలు. పరీక్షిత్తూ! తగిన శాస్తి అనుభవిస్తావు. నీకు గుణపాఠం నేర్పే ఈ శృంగి అనే వాడొకడు ఉన్నాడిక్కడ అన్న సంగతి నీకు తెలియదా! అని భయంకరంగా నవ్వాడు శృంగి పళ్ళు పటపట కొరుకుతూ.

కౌశికీ నదిలోంచి జలాన్ని దోసిలిలోకి తీసుకొని ఆచమనం చేసి 'నీ మూర్ఖతకు ఫలం అనుభవించు. విను. జాగ్రత్తగా తెలుసుకో. నేటినుండి ఏడవ రోజున నువ్వు ఎక్కడ ఉన్నాసరే తక్షకుడు వచ్చి నిన్ను కరుస్తాడు. ఆ పాము కాటుతో నువ్వు మరణిస్తావు'



ఇలా శపించి శృంగి తన తండ్రివద్దకు హుటాహుటి వెళ్ళాడు. తండ్రిమెడలో ఆ పామును చూసి ఎలుగెత్తి గట్టిగా అరిచాడు 'నాన్నగారూ! మీ మెడలో పాము నాన్నా!' కొడుకు విలాపం చెవిసోకగానే శమీకుడి తపస్సు భగ్నమైంది. నెమ్మదిగా కనులు తెరిచి తన మెడలో ఉన్న పామును చూసి చేతితో తీసి విసిరేశాడు. కొడుకును అడిగాడు. "ఎందుకేడుస్తున్నావు నాయనా!" శృంగి తండ్రికి జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. పరీక్షిత్తుకు తానిచ్చిన శాపం  గురించి కూడా వివరించాడు.

శమీకుడన్నాడు - ఎంత తప్పుపని చేశావు నాయనా! ఎంత పాపం చేశావు! ఎంత మూర్ఖత నీది! పరీక్షిత్తు మహాత్ముడు. పరమ సజ్జనుడు. ఆదర్శ ప్రభువు. ధర్మం అంటే ప్రాణాలిస్తాడాయన. మనకు మాత్రం కర్తవ్యాలు లేవా?. మన ఆశ్రమానికి ఎవరు వచ్చినా గౌరవించవలసిన ధర్మం మనది

కాదా! నువ్వే ఆలోచించు. మనం మన కర్తవ్యాన్ని నిర్వహించామా? లేదు. పైపెచ్చు ఆ మహారాజు మన ఆశ్రమానికి వచ్చి దాహంతో బాధపడుతూ మంచినీళ్ళడిగితే అతని మాట కూడా ఎవరూ వినిపించుకోలేదు. పైగా నువ్వు శపిస్తావా? పోనీ రాజు అపరాధం చెయ్యలేదా అంటావా? అయినా ఇంత చిన్న నేరానికి అంత పెద్ద శిక్షా? మరణాన్ని మించిన దండన ఉందా? శృంగీ! నీవు చేసిన పని ఏమీ మంచిదికాదు. పరమాత్మా! ఈ నా పిల్లవాడు శృంగి ఒక పెద్ద అజ్ఞుడు. వీణ్ణి క్షమించు. రాజులేని రాజ్యంలో అశాంతి తాండవిస్తుంది. ప్రజలు నానా అగచాట్లకు గురౌతారు. దుష్టులు విజృంభిస్తారు. నాయనా! శృంగీ మునులు, తాపసులు, ఋషులు, సద్బ్రాహ్మణులు తనకు అపకారం చేసిన వారికి ఉపకారమే చేస్తారు. ఇతరులకు అపకారం చేద్దామని వారు ఆలోచించనైనా ఆలోచించరు. ఆత్మకు మానావమానాలు లేవు.



అలా దుష్కర్మ చేసిన పరీక్షిత్తు ఎలాగో తన రాజధాని చేరుకున్నాడు. అతని మనస్సు మనస్సులో లేదు. క్రోధావేశంలో తను చేసిన పని తప్పని గుర్తించాడు పరీక్షిత్తు. అతడు పాతాళం లోకి కుంగిపోయాడనే చెప్పాలి. అలాంటి బ్రహ్మణ్యుణ్ణి నేను అవమానించా, వినాశకాలే విపరీతబుద్ధి అని పెద్దలు ఊరికే అనలేదు. నాకేదో మూడింది. ఏదో ఆపద నన్ను ఆవరిస్తుంది. త్వరలో అనుకున్నాడు.

ఇలా చింతలో పడ్డ పరీక్షిత్తు దగ్గరికి శమీకుని ఆశ్రమం నుంచి ఒక ఋషికుమారుడు వచ్చాడు. పరీక్షిత్తుకు శృంగి శాపవార్తను వివరించాడు. ఆ మాట విని పరీక్షిత్తు రవ్వంత కూడా చలించలేదు. అతని ముఖంలో కించిత్తైనా భేదమే లేదు. నాకు తగిన శిక్ష విధించాడు శృంగి. నాకు మేలు చేశాడు శృంగి అని అక్కడున్న అందరితో చెప్పాడు. పరీక్షిత్తు నిజమైన మహాత్ముడు. అతనితో ఆత్మపరీక్ష, బ్రహ్మజ్ఞత పరాకాష్టకు చేరుకున్నాయి.



ఇంకా ఇలా ఆలోచించాడు పరీక్షిత్తు - ఈ లోకం అంతా అశాశ్వతం. ఏదీ నిలకడగా పట్టుమని పది నిమిషాలు కూడా ఉండదు. నేతి బీరకాయలో నెయ్యి ఉంటే ఉందేమో కాని ఈ లోకంలోను పరలోకంలోను నిజమైన సుఖం అన్నది మాత్రం లేదు. నాలో వైరాగ్యం ఎప్పటినుంచో దోబూచు లాడుతోంది. శృంగిశాపం నాకు పూర్ణవైరాగ్యానికి సోపానంలా ఉపయోగిస్తుంది. ఆత్మజ్ఞానం ఒకటే. సుఖదుఃఖాన్ని మించే ఆనందాన్ని ప్రసాదిస్తుంది. సమస్త భోగాలు వదలి శ్రీకృష్ణుని చరణముఖాల్నే ఏకాగ్రతతో స్మరించుకుంటూ జీవితాన్ని సార్థకం చేసుకుంటా ఇక.

పరీక్షిత్తు తన కొడుకైన జనమేజయుడికి పట్టాభిషేకం చేశాడు. మునివ్రతం అనుసరిస్తూ గంగానది ఒడ్డున ప్రాయోపవేశం చేశాడు. అంటే మరణించే దాకా నిరాహారదీక్ష పూనాడు. పవిత్రమైన గంగ దక్షిణతీరాన కుశాసనం మీద



కూర్చున్నాడు. కుశాగ్రాలు తూర్పుదిక్కుగా ఉన్నాయి. పరీక్షిత్తు ముఖం ఉత్తర దిక్కుగా ఉంది. పరీక్షిత్తు వైరాగ్యం లోకాన్నంతటినీ ఆశ్చర్యంలో ముంచేసింది. దేవతలు పూలవాన కురిపించారు. పరీక్షిత్తు మనస్సు శ్రీకృష్ణచరణాలమీద లగ్నం అయిపోయాయి.

**పదహారేళ్ళ మహాజ్ఞాని :**

ఎందరో మునీశ్వరులు, మహర్షులు, యతులు, పరమహంసలు, భక్తులు, జ్ఞానులు, కర్మయోగులు, యోగులు తమ తమ శిష్యులతో పరీక్షిత్తును చూడడానికి విచ్చేశారు. బ్రహ్మర్షులు, రాజర్షులు, దేవర్షులు - ఇంకా ఎందరో వచ్చారు. అత్రి, వసిష్ఠుడు, చ్యవనుడు, శారద్వతుడు, అరిష్టనేమి, భృగువు, అంగిరసుడు, పరాశరుడు, విశ్వామిత్రుడు, పరశురాముడు, మేధాతిథి, దేవలుడు, భరద్వాజుడు,

గౌతముడు, పిప్పలాదుడు, మైత్రేయుడు, అగస్త్యుడు, ఔర్వుడు, కవషుడు, వ్యాసుడు, నారదుడు - ఇలాంటి మహాత్ములు కూడా అక్కడకు వచ్చారు. వీరందరూ పరీక్షిత్తుకు మధురం, గంభీరం అయిన మాటలతో తత్త్వాన్ని ఉపదేశించారు.

ఆ సమయంలో లోకమంతా తిరుగుతూ వ్యాసుని కుమారుడైన శుకుడు కూడా అక్కడకు వచ్చాడు. శుకుడు ఒక అవధూత. అతని వయస్సు పదహారు సంవత్సరాలే. అతని శరీరం చాలా సున్నితమైంది. విశాలమైన ఛాతీ, పొడుగైన చేతులు, ఎత్తైన ముక్కు, పెద్ద పెద్ద కళ్ళు, శంఖంలాంటి మెడ, ఉంగరాల జుట్టు ఇవన్నీ శుకునికి ఎక్కడలేని అందాన్ని చేకూరుస్తున్నాయి. అతని యౌవనం చూడ ముచ్చటగా ఉంది. శుకుడు జ్ఞానులలో మహాజ్ఞాని. భక్తులలో శ్రేష్ఠుడు. పరమ భాగవతోత్తముడు పరమ ప్రశాంతుడు.





శుకుడు రాగానే పరీక్షిత్తు నమస్కరించాడు. భక్తి వినయాలతో ఇలా అన్నాడు. “స్వామీ! ఏమీ మా అదృష్టం. మీరు తమంత తామే ఇక్కడకు విచ్చేయడం అన్నది పరమాత్మునికి మామీద ఎంత అనుగ్రహం ఉందో చాటుతుంది. మీరు సర్వజ్ఞులు. మహాగురువులు. బ్రహ్మస్వరూపులు. ఒక్క విషయం అడుగుతాను చెప్పండి. మృత్యువు సమీపించినప్పుడు మానవుడు ఏమి చెయ్యాలి. అతడు దేన్ని సేవించాలి? దేన్ని వదలాలి? మనుష్యజన్మ ఎత్తాక మనిషి చేయవలసిన అన్నింటికన్న ముఖ్యమైన కర్తవ్యం ఏదైనా ఉందా? ఉంటే అది ఏమిటి? తమ దర్శనమే మహాదుర్లభం. తమ ఉపదేశంతో నన్ను అనుగ్రహించండి.”

రాజప్రశ్నకు శుకుడు ఎంతో సంతోషించి ‘మృత్యువంటే భయపడే అవసరం లేదు’ అన్నాడు శుకుడు. “వైరాగ్యం



అనే శాస్త్రంతో అహంకారాన్ని, మమకారాన్ని, మొదలంటూ ఖండించాలి. ఎంతవరకు పుట్టుక, చావు, బ్రతుకు - ఉంటాయో అంతవరకూ మానవుణ్ణి దుఃఖం వేధిస్తూనే ఉంటుంది. జనన మరణాల్ని అతిక్రమించినప్పుడే మనిషిని సుఖదుఃఖాలు ఏమీ చేయలేవు. అప్పుడే అతనికి పరమానందం లభిస్తుంది. ఇదే మానవుడు సాధించవలసిన పరమార్థం. దీన్ని పొందాలి. అంటే ఒక ఉపాయం ఉంది. చెబుతా విను -

అది శ్రీమద్భాగవత శ్రవణమే. దాన్ని విను. ఈ భాగవతాన్ని మొదట శ్రీమహావిష్ణువు బ్రహ్మకు చెప్పాడు. ఆ బ్రహ్మ నారదుడికి, నారదుడు మా తండ్రిగారైన వ్యాసులవారికి చెప్పారు. వారు ఆ భాగవతాన్ని నాకు చెప్పారు. దాన్ని నీకు నేను చెప్తాను. ఈ భాగవతం వేదతుల్యం. వేదవేదాంతసార

సంగ్రహం. పురాణాలలో ఇది ఉత్తమోత్తమమైంది. ఇది సూర్యునివంటిది. భాగవతాన్ని వింటే అజ్ఞానాంధకారం పటాపంచలైపోతుంది. శ్రీమద్భాగవతం సర్వదుఃఖాలను సంపూర్ణంగా నాశనంచేసి మానవుడికి సత్యం, జ్ఞానం, అనంతం, ఆనందం అయిన అతని నిజస్వరూపాన్ని అతనికి ప్రసాదిస్తుంది.

శుకమహర్షి సభికుల సన్నిధిలో శ్రీమద్భాగవతాన్ని వివరించాడు.

భాగవతాన్ని విని పరీక్షిత్తు శుకమహర్షితో ఇలా అన్నాడు. 'మహాత్మా! మీరు ఉపదేశించిన జ్ఞాన విజ్ఞానాలవల్ల నా అజ్ఞానం, దుఃఖం పూర్తిగా సమసిపోయాయి. తమరు నాకు సర్వోత్తమమైన శ్రేయస్సును అనుగ్రహించాలి.'



మునికుమారుడైన శృంగిశాపం ప్రకారం తక్షకుడు పరీక్షిత్తును కరవడానికి వస్తున్నాడు. దారిలో అతనికి కశ్యపుడు అనే బ్రాహ్మణుడు కన్పించాడు. కశ్యపుడు విషాపహరణ విద్యలో దిట్ట. ఎలాంటి పాముకాటునైనా సరే కశ్యపుడు నయం చేస్తాడు. ఒకవేళ పాము కాని పరీక్షిత్తును కాటువేస్తే నేను ఆ విషాన్ని నిష్ఫలం చేసి పరీక్షిత్తును బతికిస్తా. ఈ విధంగా పుష్కలంగా డబ్బుగడిస్తా అని కశ్యపుడు బాహాటంగా చెబుతున్నాడు. బ్రాహ్మణవేషంలో ఉన్న తక్షకుడు ఆ కశ్యపునకు ఎంతో ధనం ఇచ్చి అతణ్ణి వెనక్కి పంపివేశాడు. విధిని ఎవరూ మార్చలేరు కదా!

తక్షకుడికి ఏ రూపం పడితే ఆ రూపం ధరించే శక్తి ఉంది. ఈ కామరూప విద్యతో అతడు బ్రాహ్మణుడుగా మారాడు. పరీక్షిత్తు వద్దకు వెళ్ళాడు. పరీక్షిత్తును కాటువేశాడు.



అప్పటికే పరీక్షిత్తు బ్రహ్మభావాన్ని పొందిఉన్నాడు.

తక్షకుని విషాగ్ని పరీక్షిత్తును ఒక్క క్షణంలో భస్మం చేసింది. లోకాలన్నీ తల్లడిల్లిపోయాయి. హాహాకారంతో నిండిపోయాయి.

పరీక్షిత్తు బ్రహ్మభావాన్ని పొందాడు. దివ్యదుందుభులు మ్రోగాయి. గంధర్వులు పాడారు. అప్సరసలు ఆడారు. ఆకాశం నుంచి పుష్పవర్షం కురిసింది.

**ధన్యజీవి పరీక్షిత్తు**